క్లుప్తంగా

దత్తాత్రేయస్వామికి విశేష పూజలు

శ్రీశైలం: లోకకల్యాణం కోసం శ్రీశైల దేవస్థానం గురువారం సందర్భంగా ఆలయ ప్రాంగణంలోని త్రిఫల వృక్షం కింద వెలసిన శ్రీదత్తాత్రేయస్వామికి విశేష పూజలను దేవస్థానం ఈఓ పెద్దిరాజు, అర్చకులు నిర్వహించారు. పూజా కార్యక్రమాలు నిర్విఘ్నంగా జరిగేందుకు ముందుగా మహాగణపతి పూజ జరిపించారు. అనంతరం దత్తాత్రేయస్వామికి అభిషేకాధి, అర్చనలు చేసి ప్రసాద వితరణ గావించారు.

పేదలకు వరం సీఎం రిలీఫ్ ఫండ్



బాధిత కుటుంబానికి సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కును అందజేసిన ఎమ్మెల్యే తొగురు ఆర్థర్

నందికొట్కూరు: ఆపదలో ఉన్న పేదలకు సీఎం రిలీఫ్ ఫండ్ పథకం ఓ వరమని ఎమ్మెల్యే తొగురు ఆర్థర్ స్పష్టం చేశారు. పగిడ్యాల మండలం నెహ్రూనగర్ గ్రామానికి చెందిన కట్టుబడి లక్ష్మీదేవి భర్త కట్టుబడి బాబు ఆరోగ్య వైద్య ఖర్చుల నిమిత్తం సీఎం రిలీఫ్ ఫండ్ నుంచి రూ. 65 వేలు ప్రభుత్వం మంజూరు చేసింది. గురువారం పట్టణంలోని వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో చెక్కును ఎమ్మెల్యే బాధితులకు అందజేశారు. కార్యక్రమంలో ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షుడు రమణ, గ్రామ వైఎస్సార్‌సీపీ నాయకులు శ్రీనాథరెడ్డి, డాక్టర్ రాజు పాల్గొన్నారు.

బీజేపీని గద్దె దించడమే లక్ష్యం

ఆత్మకూరు: కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వాన్ని గద్దె దించడమే సీపీఎం లక్ష్యమని ఆ పార్టీ జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు ఏసురత్నం, పట్టణకార్యదర్శి రణధీర్, వెంకటేష్ అన్నారు. పట్టణంలోని ధనుంజ మీటింగ్‌హాల్ లో గురువారం పార్టీ సభ్యుల సమావేశం నిర్వహించారు. వారు మాట్లాడుతూ దేశ ప్రజలపై విచ్చలవిడిగా ఆర్థిక భారాలు మోపిన బీజేపీ ప్రభుత్వాన్ని సాగనంపాలన్నారు. కార్పొరేట్లకు ఊడిగం చేస్తూ పెట్టుబడి దారి విధానానికి తెర లేపిన మోదీ ప్రభుత్వానికి ప్రజలు గుణపాఠం చెప్పాలని పిలుపునిచ్చారు. ఈ నెల 31 వ తేదిన ఆత్మకూరులో నిర్వహిస్తున్న బస్సు జాతాను విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు సురేంద్ర, స్వాములు, వీరన్న, గణపతి, మోహన్, శ్యామ్, రమణ పాల్గొన్నారు.

విద్యాసంస్థల బంద్‌ను విజయవంతం చేయండి

ఆత్మకూరు: విశాఖ ఉక్కుపరిశ్రమ ప్రైవేటీకరణకు నిరసనగా, కడప స్టీల్ ప్లాంట్ సాధన కోసం నవంబర్ నెల 8 వ తేదిన తలపెట్టిన రాష్ట్ర విద్యా సంస్థల బంద్‌ను విజయవంతం చేయాలని ఏఐఎస్ఎఫ్, వామపక్ష విద్యా యువజన సంఘం నాయకులు శ్రీనివాసులు, ఆరీఫ్, మద్దిస్వామి పిలుపునిచ్చారు. పట్టణంలోని సీపీఐ కార్యాలయంలో గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ.. విశాఖ ఉక్కు కోసం 32 మంది అసువులు బాసారని, లాభాలు తెస్తున్న పరిశ్రమను కేంద్రప్రభుత్వం ప్రైవేటీకరణ చేయడానికి సిద్ధం కావడం ఆందోళన కలిగిస్తుందన్నారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షులు వినోద్, నాయకులు ఆరీఫ్, రంగస్వామి, నవీన్ తదితరులు పాల్గొన్నారు.

సమగ్ర భూ సర్వేను పకడ్బందీగా చేపట్టండి



భూసర్వేను పరిశీలిస్తున్న తహసీల్దార్

జూపాడుబంగ్లా: సమగ్ర భూ రీసర్వేను పకడ్బందీగా, వేగవంతం పూర్తిచేయాలని తహసీల్దార్ పుల్లయ్యయాదవ్ సర్వే సిబ్బందిని ఆదేశించారు. గురువారం ఆయన మండలంలోని తర్తూరు గ్రామంలో జరుగుతున్న సమగ్ర భూసర్వే కార్యక్రమాన్ని పరిశీలించారు. గ్రామంలోని ఇప్పటిదాకా సర్వేచేసిన భూముల వివరాలను సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. గ్రామాల్లో దండోరా వేయించటంతో పాటు రైతులకు నోటీసులు జారీచేసి వారి సమక్షంలో భూములను సర్వేచేసి సరిహద్దులు చూపించాలన్నారు. రోవర్లను వినియోగించి రోజుకు కనీసం వంద ఎకరాల సర్వే పూర్తిచేసి, డిసెంబర్ నెలాఖరులోగా భూసర్వే ప్రక్రియను పూర్తిచేసి రైతులకు పాసుపుస్తకాలను అందజేయాల్సిన బాధ్యత ప్రతిఒక్కరిపై ఉందన్నారు. కార్యక్రమంలో వీఆర్వో శ్రీనివాసులునాయుడు, సర్వేసిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవిస్తే జైలుకే

మహానంది: మహానంది ఆలయ పరిసరాలతో పాటు బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవిస్తే జైలుశిక్ష తప్పదని మహానంది ఎస్ఐ నాగేంద్రప్రసాద్ హెచ్చరించారు. గురువారం రాత్రి ఆలయ పరిసరాలు, గ్రామాల్లో తనిఖీలు నిర్వహించారు. ఈ మేరకు ఎస్ఐ నాగేంద్రప్రసాద్ మాట్లాడుతూ నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరించేవారిపై కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. గ్రామాల్లో బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవించడం, అల్లర్లకు పాల్పడేవారిపై ప్రజలు సమాచారం అందించాలన్నారు.

పంటలు కళకళ

- కోనసీమను మరిపిస్తున్న ఆయకట్టు
- తెలుగు గంగ, కేసీ కెనాల్, నిప్పులవాగు కింద విస్తారంగా వరి సాగు
- పలుచోట్ల కోతకు దశకు వచ్చిన పంట
- రెండో పంటకు సిద్ధమవుతున్న రైతులు



కోతకు వచ్చిన వరి పంట



వెలుగోడు మండలంలోని బోయరేవుల గ్రామసమీపంలో కొబ్బరిచెట్ల నడుమ కనువిందు చేస్తున్న వరి పంట

ఆత్మకూరు: ఈ ఏడాది వర్షాలు అనుకున్న స్థాయిలో లేకపోయినప్పటికీ తెలుగు గంగ, కేసీ కెనాల్‌లకు ప్రభుత్వం నీటిని విడుదల చేస్తుండటంతో శ్రీశైలం నియోజకవర్గంలోని ఆయా కాలువల ఆయకట్టు ప్రాంతాలు వరి పంటతో కళకళలాడుతూ కోనసీమను మరిపిస్తున్నాయి. పచ్చని పైర్లతో పచ్చదనాన్ని పరిచినట్లు ఊరూరా అత్యంత ఆహ్లాదాన్ని పంచుతున్నాయి. నియోజకవర్గం పరిధిలోని వెలుగోడు, బండిఆత్మకూరు, మహానంది, ఆత్మకూరు మండలాల్లోని పలు ప్రాంతాల్లో ప్రకృతి అందాన్ని ప్రజలు, రైతులు ఆస్వాదిస్తున్నారు.

60 వేల ఎకరాల్లో వరిపంట సాగు

శ్రీశైలం నియోజకవర్గంలో ఆత్మకూరు మండలంలోని సిద్ధాపురం చెరువు కింద 2 వేల ఎకరాలు, వెలుగోడు మండలంలో తెలుగు గంగ , కేసీ కెనాల్, నిప్పుల వాగు కింద 15 వేలు, బండిఆత్మకూరు మండలంలో ఇదే ఆయకట్టు కింద 27 వేల ఎకరాలు, మహానంది మండలంలో మరో 17 వేల ఎకరాల్లో వరి పంట సాగయ్యింది. రైతులు ఈ కాల్వల కింద వరి పంటను పండించడంతో పచ్చని హారంలా రహదారుల వెంట గ్రామాల చుట్టూ పొలాల గట్ల వెంట ఎటు చూసినా పచ్చదనంతో కళకళలాడుతున్నాయి.

ఎకరాకు 40 బస్తాలకు పైగానే ధాన్యం

నియోజకవర్గంలోని తెలుగు గంగ, కేసీ కెనాల్ ఆయకట్ట పరిధిలోని వెలుగోడు, బండిఆత్మకూరు, మహానంది మండలాల్లో వరి పంటను కోనసీమ రైతన్నలకు దీ పంట సాగు చేస్తున్నారు. వివిధ మండలాల్లో ఈ ప్రాంత రైతులు ఎకరాకు 40 నుంచి 50 బస్తాల దాకా వరి పంట దిగుబడి సాధిస్తున్నారు. గతేడాది బండిఆత్మకూరు, మహానంది మండలాల్లో వరి పంట సాగు ఉత్తమ ఆదర్శ రైతులుగా జిల్లాలో అవార్డు సాధించారు. ప్రస్తుతం ఈ మండలాల్లో కొన్ని చోట్ల వరి పంట కోత దశకు చేరడంతో రైతులు కల్లాల్లో ధాన్యం నింపుతున్నారు. పలు ప్రాంతాల్లో వరి పంట ను రెండో పంట వేసేందుకు కూడా రైతులు సిద్ధమవుతున్నారు.

పంటలు బాగా పండాయి



ఆత్మకూరు డివిజన్, శ్రీశైలం నియోజకవర్గంలో తెలుగుగంగ, కేసీ కెనాల్ వరదరాజస్వామి ప్రాజెక్ట్ కింద వరి పంట ఆశాజనకంగా పండింది. రైతులు ఈ ఏడాది ఖరీఫ్‌లో ఎక్కువగా వరి పంట వేశారు. అన్ని మండాలాల్లో ఈ పంట బాగా ఏపుగా పెరిగి కోత దశకు చేరింది. రైతులు త్వరలోనే పంట నూర్పిడి చేయనున్నారు. దిగుబడి బాగా వచ్చే అవకాశం ఉందని రైతులు కూడా ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు. – అంజనేయ, ఏడీఏ, ఆత్మకూరు

సబ్సిడీ పథకాలను సద్వినియోగం చేసుకోవాలి

కొత్తపల్లి: మండలంలోని రైతులందరూ అందుబాటులో ఉన్న ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని ఉద్యావన శాఖ అధికారిణి కె. చందన అన్నారు. రైతులు సాగుచేసుకునేందుకు ముందుకొస్తే మామిడి రూ.13,300, జామ రూ. 29,331, చీనీ రూ.16,004, దానిమ్మ రూ.26,672, డ్రాగన్ ఫ్రూట్ రూ.30,000, నేరేడు రూ.16,000, చింత రూ.7,339 పంటలకు ఏరియా ఎక్స్‌పాన్షన్ పథకం ద్వారా సబ్సిడీలు అందిస్తామని తెలిపారు. అదేవిధంగా పూల తోటల పెంపకం ద్వారా బంతి, చామంతి, గులాబీ, మల్లె, లిల్లీ వంటి తోటలకు సబ్సిడీ రూ.16,000 అందిస్తున్నామని చెప్పారు. వ్యక్తిగత ఫార్మ్ పాండ్‌లకు రూ. 75,000, సామూహిక ఫార్మ్ పాండ్‌లకు రూ.20 లక్షల వరకు సబ్సిడీ ప్రభుత్వం ఇస్తుదని తెలిపారు. ప్లాస్టిక్ మల్చింగ్ ద్వారా రూ. 16,000, పండ్ల తోటల రైతులకు ప్యాక్ హౌస్‌లకు రూ.2 లక్షల సబ్సిడీ ప్రభుత్వం అందిస్తుందని వెల్లడించారు. ఉల్లి గోదాములు, ఉల్లి విత్తనాల యంత్రాలు, మినీ ట్రాక్టర్లు, తైవాన్ స్ప్రేయర్లు తదితర వాటిపై సబ్సిడీలు ఉన్నాయని, వీటికొరకు ఉద్యాన అధికారిణిని, సంబంధిత రైతు భరోసా కేంద్రాలను రైతులు సంప్రదించాన్నారు.

రైతు ఉత్పత్తిదారుల సంఘాలు ఏర్పాటు చేయండి



మాట్లాడుతున్న డీఆర్‌డీఏ పీడీ శ్రీధర్‌రెడ్డి

ఆత్మకూరు: పొదుపు సంఘాల మాదిగానే రైతులకు సంబంధించి ప్రతి మండలంలో రైతు ఉత్పత్తిదారుల సంఘాలను మరిన్ని ఏర్పాటు చేయాలని డీఆర్‌డీఏ పీడీ శ్రీధర్‌రెడ్డి సూచించారు. పట్టణంలోని మండల సమాఖ్య కార్యాలయంలో గురువారం పొదుపు సంఘాల సభ్యులతో, సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ రైతు సంఘాలు ఏర్పాటు చేయడం ద్వారా తక్కువ పెట్టుబడితో ఎక్కువ లాభాలు వచ్చేలా రైతులకు సంబంధించి ప్రకృతి వ్యవసాయం వైపు వారిని తీసుకువెళ్లే అవకాశం ఉందన్నారు. రైతుల సాధికారిత సంస్థల వలన ఏ పనులు చేస్తున్నారో తదితర అంశాలను డీపీఎమ్ సురేష్ వివరించారు. అనంతరం పీడీ గ్రామైఖ్య సంఘాల పుస్త కాలను పరిశీలించారు. కార్యక్రమంలో ఏపీ పుల్లయ్య, ఏబీఎం ఉమామహేశ్వరమ్మ, అనురాధ, సీసీలు వెంకటరమణ, జ్యోతి, శివమ్మ తదితరులు పాల్గొన్నారు.

పంట నమోదు జాబితాను సరిచూసుకోండి



నందికుంట ఆర్‌బీకే వద్ద పంట నమోదు ముసాయిదా జాబితాను పరిశీలిస్తున్న ఏడీఏ ఆంజనేయ

కొత్తపల్లి: పంట నమోదు చేసుకున్న రైతుల జాబితాను రైతు భరోసా కేంద్రాల వద్ద సరిచూసుకోవాలని ఆత్మకూరు వ్యవసాయ సంచాలకులు బి.అంజనేయ సూచించారు. గురువారం మండలంలోని నందికుంట గ్రామ రైతు భరోసా కేంద్రాన్ని సందర్శించి పంట నమోదుపై సామాజిక తనిఖీ నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ఖరీఫ్ సీజన్‌కు సంబంధించి వందశాతం పంట నమోదు, రైతుల ఈ-కేవైసీ పూర్తిచేశామన్నారు. పంటల నమోదు ముసాయిదా జాబితాను సామాజిక తనిఖీల నిమిత్తం ఈనెల 26 నుంచి 29వ తేదీ వరకు అన్ని రైతు భరోసా కేంద్రాలలో ప్రదర్శిస్తున్నామని చెప్పారు. పంట నమోదు వివరాలపై అభ్యంతరాలు ఉంటే రాతపూర్వకంగా సంబంధిత రైతు భరోసా కేంద్ర సిబ్బందికి తెలపాలని సూచించారు. అదేవిధంగా మండలంలోని అన్ని ఆర్బీకేల్లో ఈనెల 29 వరకు పంట నమోదుపై గ్రామ సభలను నిర్వహిస్తామన్నారు. కార్యక్రమంలో ఏఓ కె.మహేష్, గ్రామ వ్యవసాయ సహాయకుడు వి శివకృష్ణ నాయక్, ఎంపీఈఓ ఉమామహేశ్వరి బాయి పాల్గొన్నారు.

ఆత్మకూరు డివిజన్‌లో వంద శాతం ఈ-కెవైసీ

ఆత్మకూరు : డివిజన్ పరిధిలోని అన్ని మండలాల్లో ఈ-కెవైసీ వంద శాతం పూర్తయినట్లు ఏడీఏ ఆంజనేయ తెలిపారు. గురువారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఆత్మకూరు మండలంలో 19,426.12 ఎకరాలు, కొత్తపల్లి మండలంలో 22735.36 ఎకరాలు, పాములపాడు 21852.4 ఎకరాలు, వెలుగోడు మండలంలో 12,779.94 ఎకరాల్లో రైతులు పంటలు సాగు చేశారన్నారు. మొత్తం డివిజన్‌లో 76,795,82 ఎకరాల్లో ఈ-క్రాప్ నమోదు చేశామని తెలిపారు. ఖరీఫ్‌లో పంటలు సాగు చేసిన రైతుల ఈ-క్రాప్‌ను వంద శాతం నమోదు చేశామని చెప్పారు. ప్రస్తుతం ఈ క్రాప్ నమోదైన వివరాలను అన్ని సచివాలయాల వద్ద ప్రదర్శిస్తున్నామన్నారు. ఈ-క్రాప్ నమోదును వంద శాతం పూర్తి చేసేందుకు సహకరించిన సిబ్బందికి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో ఏఓ విష్ణువర్ధన్‌రెడ్డి పాల్గొన్నారు.

అంబులెన్స్‌లోనే గొర్రెకు శస్త్ర చికిత్స



అంబులెన్స్‌లోనే శస్త్రచికిత్స చేసి పిల్లను బయటికి తీస్తున్న పశువైద్యులు

కొత్తపల్లి: రాష్ట్ర ప్రభుత్వం గ్రామీణ ప్రాంతాల్లోని మూగ జీవాలకు సైతం వైద్యం అందించేందుకు, అత్యసరసమయాల్లో వాటిని పశువైద్యశాలకు తరలించేందుకు వైఎస్సార్ పశుసంచార ఆరోగ్య సేవలను అందుబాటులోకి తెచ్చింది. ఇందులో భాగంగా పశువులను తరలించేందుకు ప్రత్యేక అధునాత వైద్య పరికరాలతో కూడిన అంబులెన్స్‌లను అందుబాటులో ఉంచింది. 1962 టోల్‌ఫ్రీ నంబర్‌కు కాల్‌చేస్తే చాలు వాహనంతో పశువైద్యులు చేరుకొని వైద్య సేవలు అందిస్తున్నారు. మండలంలోని శివపురం గ్రామంలో నరసింహనాయుడు అనే వ్యక్తికి 100 గొర్రెలు ఉన్నాయి. అందులో ఒక గొర్రె మూడురోజుల నుంచి ఈనలేక ప్రసవ వేదన పడుతోంది. రైతుల సహాయంతో ఆయన వెంటనే మండల పశువైద్యాధికారిణికి, 1962 టోల్‌ఫ్రీ ద్వారా అంబులెన్స్‌కు సమాచారం అందించారు. గురువారం పశువైద్యులు వైఎస్సార్ పశుసంచార ఆరోగ్య సేవ వాహనంతో గ్రామానికి చేరుకొని అందులోనే గొర్రెకు శస్త్ర చికిత్స చేసి, కడుపులోనే చనిపోయిన పిల్లను బయటికి తీశారు. గొర్రె ఆరోగ్యం ప్రస్తుతానికి బాగానే ఉందని రైతన్న ఆనందం వ్యక్తం చేశారు. రైతులు, పశువుల యజమానులు వైఎస్సార్ పశుసంచార ఆరోగ్య సేవ వాహనం సేవలను సద్వినియోగం చేసుకోవాలని డాక్టర్ భువనేశ్వరి కోరారు. కార్యక్రమంలో అంబులెన్స్ డాక్టర్ ఇర్ఫాన్, పశువైద్య సహాయకులు రామ్ చరణ్ తేజ తదితరులు ఉన్నారు.

పట్టుదలతోనే విజయాలు



ఐపీఎస్ మనీషారెడ్డిని అభినందిస్తున్న వైఎస్సార్ సీపీ లీగల్ సెల్ ఉపాధ్యక్షుడు వేణుగోపాల్‌రెడ్డి

మహానంది: కష్టపడేతత్వం, కృషి, పట్టుదలతో అనుకున్న లక్ష్యాలను నెరవేరుతారని, అందుకు నందిపల్లెకు చెందిన మనీషారెడ్డి ఐపీఎస్‌గా ఎంపికవడం నిదర్శనమని వైఎస్సార్‌సీపీ లీగల్‌సెల్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు, ఏపీ, టీఎస్ హ్యూమన్‌రైట్స్ చైర్మన్ వేణుగోపాల్‌రెడ్డి తెలిపారు. నందిపల్లె గ్రామానికి చెందిన మనీషారెడ్డి ఐపీఎస్‌గా ఎంపికకావడంతో ఆమె స్వగ్రామానికి వెళ్లి గురువారం అభినందించారు. రైతు కుటుంబానికి చెందిన సాగేశ్వరరెడ్డి మనవరాలు ఐపీఎస్‌గా ఎంపికవడం హర్షించదగిన విషయమన్నారు. కార్యక్రమంలో ఐపీఎస్ మనీషారెడ్డి తండ్రి రాజురెడ్డి, తదితరులు పాల్గొన్నారు.


డోర్ డెలివరీ సేవలు సద్వినియోగం చేసుకోండి



కరపత్రాలు విడుదల చేస్తున్న ఆర్టీసీ డీఎం నాగేశ్వరరావు

నందికొట్కూరు: ఆర్టీసీ సంస్థ అందిస్తున్న పార్సిల్ డోర్ డెలివరీ సదుపాయాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఆర్టీసీ డిపో మేనేజర్ నాగేశ్వరరావు అన్నారు. గురువారం పట్టణంలోని ఆర్టీసీ డిపోలో డోర్ డెలివరీ మాసోత్సవం కార్యక్రమం కరపత్రాలను డీఎం, ఉద్యోగులు విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డోర్ డెలివరీ కార్యక్రమం 2017 ప్రారంభించడం జరిగిందన్నారు. 2017–2022 వరకు రూ.122 కోట్లు వరకు ఆదాయం వచ్చిందని చెప్పారు. పార్శిల్ సర్వీస్‌పై ప్రజలకు నెల రోజుల పాటు అవగాహన కల్పిస్తునట్లు స్పష్టం చేశారు. కార్యక్రమంలో డిపో సూపర్ వైజర్లు, కార్మికులు, తదితరులు పాల్గొన్నారు.

ప్రకృతి ప్రతిబింబం



రుద్రగుండం కోనేరులో గోపురాల ప్రతిబింబాలు



ఆకాశంలో ఆకట్టుకుంటున్న వర్ణాలు

మహానంది: నల్లమల పచ్చటి ప్రకృతి అందాలు, పక్షుల కిలకిలరావాలు, కోనేటిలోని స్వచ్ఛమైన, వెచ్చనైన గంగమ్మ జల సవ్వడులకు నిలయమైన మహానంది అందాలు భక్తుల మదిని దోచుకుంటాయి. ఆలయాన్ని ఎటు వైపు నుంచి చూసినా మహా ఆనందమే. చరిత్రాత్మకమైన ఆలయ గోపురాల అందాలకు ప్రకృతి, మేఘాలు, అరువర్ణాలు తోడైన వేళ ప్రకృతి ప్రేమికులను, భక్తులను కట్టిపడేస్తాయి. అందులో భాగంగా మహానంది ఆలయంలో గురువారం సాయంత్రం ఆకాశంలో రంగురంగుల వర్ణాలు అబ్బురపరిచాయి. క్నోనీటిలో ప్రతిబింబించే పంచలింగాల మండపం, ముఖ మండపం గోపురాలు ముచ్చటగా కనిపించిన దృశ్యాలు చూపరులను ఆకట్టుకున్నాయి.

జగనన్న ఆరోగ్య సురక్ష..పేదలకు శ్రీరామ రక్ష



కొత్తపాలమర్రిలో మెడికల్ క్యాంప్‌ను పరిశీలిస్తున్న జెడ్పీటీసీ పుల్యాల దివ్య



మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షులు రాజమోహన్‌రెడ్డి

పగిడ్యాల: జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం పేద ప్రజలకు శ్రీరామ రక్ష అని జెడ్పీటీసీ పుల్యాల దివ్య అన్నారు. గురువారం మండలంలోని కొత్త పాలమర్రి ప్రాథమిక పాఠశాల ఆవరణలో ఎంపీడీఓ వెంకటరమణ ఆధ్వర్యంలో ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాన్ని ఆమె ప్రారంభించారు. అనంతరం జెడ్పీటీసీ మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలన ఓ సువర్ణయుగమన్నారు. ఎన్నో సంక్షేమ పథకాలను ప్రవేశపెట్టి ఆర్థిక తోడ్పాటును అందిస్తున్నారని తెలియజేశారు. పట్టణాలకే పరిమితమైన స్పెషలిస్టు డాక్టర్లను గ్రామీణ బాట పట్టించి వైద్య సేవలు అందిస్తున్న ముందు చూపున్నా నాయకుడు జగనన్న అని కొనియాడారు. అలాగే వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్, మాజీ జెడ్పీటీసీ పుల్యాల నాగిరెడ్డి మాట్లాడుతూ ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. మెడికల్ క్యాంప్‌లో 800 మందికి వైద్య పరీక్షలు నిర్వహించి మెరుగైన వైద్యం కోసం 26 మందిని ఆరోగ్యశ్రీకి రెఫర్ చేశామని వైద్యాధికారి మోహన్ తెలిపారు. డాక్టర్లు శ్వేత, క్రిష్ణమూర్తి, విలాయత్, అనిల్‌కుమార్, వైద్య సేవలు అందించిన వారిలో ఉన్నారు. ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని పురస్కరించుకుని మాతా శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన పోషకాహార స్టాల్‌ను జెడ్పీటీసీ, సర్పంచ్ జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ వెంకటరమణ, తహసీల్దార్ భారతి, ఎంఈఓ సుభాన్, సర్పంచ్ శేషన్న పాల్గొన్నారు.

పేదలకు వరం 'జగనన్న ఆరోగ్య సురక్ష'

ఆత్మకూరు: నిరుపేదలకు జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం వరం అని కరివేన సర్పంచ్ మాణిక్యమ్మ, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు రాజమోహన్‌రెడ్డి, మండల వైద్యాధికారులు పవన్‌కుమార్, గోపాల్ అన్నారు. మండలంలోని కరివేన గ్రామంలో గురువారం జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు కొండల రావు, జయన్న, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

552 మందికి వైద్యసేవలు

మహానంది: మసీదుపురం గ్రామంలో గురువారం నిర్వహించిన జగనన్న ఆరోగ్య సురక్ష క్యాంపులో 552 మందికి వైద్యసేవలు అందించినట్లు ఎంపీడీఓ శివనాగజ్యోతి తెలిపారు. మసీదుపురంలో సచివాలయం వద్ద జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం నిర్వహించారు. తిమ్మాపురం, గాజులపల్లె ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల వైద్యులు డాక్టర్ శాంతిప్రియ, డాక్టర్ వెంకటరెడ్డి, నంద్యాలకు చెందిన నిపుణులైన వైద్యులు సేవలు అందించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ కేవీఆర్ మహేశ్వరరెడ్డి, సర్పంచ్ లక్ష్మీరెడ్డి, ఎంపీటీసీ మునగాల మల్లికార్జునరెడ్డి పాల్గొన్నారు.

నేడు మహానందిలో..

మహానందిలో శుక్రవారం సచివాలయం వద్ద జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ తెలిపారు.

సారా విక్రేత అరెస్టు

మిడుతూరు: మండల పరిధిలోని తలముడిపి గ్రామంలో సారా విక్రయిస్తున్న నందికొట్కూరు పట్టణానికి చెందిన నీలిషికారి అశోక్‌ను అదుపులోకి తీసుకున్నామని ఎస్ఐ జగన్‌మోహన్ గురువారం తెలిపారు. అతని వద్ద నుంచి 10 లీటర్ల నాటు సారా స్వాధీనం చేసుకొని, కేసు నమోదు చేసికొని, రిమాండ్‌కు పంపినట్లు వెల్లడించారు.

ఈ-క్రాప్ నమోదు జాబితా విడుదల

ఆత్మకూరు: మండలంలోని అన్ని గ్రామాల్లో రైతు భరోసా కేంద్రాలు, ఈ-క్రాప్ నమోదు చేసిన రైతుల జాబితాను మండల వ్యవసాధికారి విష్ణువర్ధన్‌రెడ్డి విడుదల చేశారు. ఆయన మాట్లాడుతూ ఈ నెల 25 నుంచి 30వ తేదీ వరకు రైతులు ఏమైనా అభ్యంతరాలు ఉంటే తాము నిర్వహించే గ్రామసభలో మార్పులు చేర్పులు వివరాలను పొందపరచ్చునని చెప్పారు.

ఐఎంఏ నంద్యాల మహిళా విభాగం ఎన్నిక

నంద్యాలటౌన్: ఐఎంఏ నంద్యాల శాఖ మహిళా విభాగం నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నట్లు ఐఎంఏ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ రవికృష్ణ తెలిపారు. గురువారం స్థానిక కార్యాలయంలో నిర్వహించిన ఎన్నికలో నంద్యాల ఐఎంఏ మహిళా విభగం అధ్యక్షురాలిగా డాక్టర్ కల్పన, కార్యదర్శిగా డాక్టర్ సరిత ఎన్నికయ్యారన్నారు. కోశధికారిగా లలిత, ఉపాధ్యక్షులుగా నేట్ల శిల్పా, ప్రియదర్శిని, కార్యవర్గ సభ్యులుగా షబ్నం, మల్లీశ్వరి, హర్షిణి, సాయి హరీష, కీర్తి రెడ్డి, సునీత, కృష్ణవేణి, క్రాంతి, కావ్య, అనూష ఎన్నికయ్యారని చెప్పారు.

స్టేట్‌బ్యాంకులో అగ్ని ప్రమాదం

బొమ్మలసత్రం: నంద్యాల పట్టణంలోని శ్రీనివాస నగర్‌లో ఉన్న స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా బ్యాంక్‌లో గురువారం వేకువజామున అగ్ని ప్రమాదం చోటు చేసుకుంది. ఫైర్ ఆఫీసర్ యోగీశ్వరరెడ్డి తెలిపిన వివరాల మేరకు.. ఎస్‌బీఐ బ్యాంక్‌లో తెల్లవారుజామున మంటలు చెలరేగి పొగలు రావడాన్ని సెక్యూరిటీ సిబ్బంది గుర్తించారు. వెంటనే ఫైర్ సిబ్బందికి సమచారం ఇవ్వడంతో సంఘటనా స్థలానికి ఫైర్ ఇంజన్లతో సిబ్బంది చేరుకుని మంటలను అదుపులోకి తెచ్చారని చెప్పారు. అగ్ని ప్రమాదంలో ఒక ఏసీ, కంప్యూటర్ , కొన్ని రికార్డులు దగ్ధమయ్యాయని, షార్ట్ సర్క్యూట్ వల్లే ప్రమాదం చోటుచేసుకుందని పేర్కొన్నారు.

మల్లన్నను దర్శించుకున్న మేదినీపూర్ ఎంపీ



ప్రధానాలయ రాజగోపురం వద్ద ఎంపీకి ఆహ్వానం పలుకుతున్న అధికారులు

శ్రీశైలం: శ్రీశైల శ్రీభ్రమరాంబామల్లికార్జునస్వామి వార్లను వెస్ట్‌బెంగాల్లోని మేదినీపూర్ ఎంపీ దిలీప్ ఘోష్ దర్శించుకున్నారు. వీరికి ప్రధానాలయ రాజగోపురం వద్ద దేవస్థానం అధికారులు, అర్చకులు ఆలయ మర్యాదలతో ఆహ్వానం పలికారు. అనంతరం వీరు స్వామివారికి రుద్రాభిషేకం,అమ్మవారికి కుంకుమార్చన తదితర ప్రత్యేక పూజలు నిర్వహించుకున్నారు. అనంతరం అమ్మవారి ఆశీర్వచన మండపంలో అర్చక వేదపండితులు ఆశీర్వచనాలు పలుకగా, అధికారులు స్వామివార్ల శేషవస్త్రాలు, లడ్డూప్రసాదాలు అందజేశారు.

అయోడిన్ లోపంతో అనర్థాలు

నంద్యాల(సిటీ): మానవుని శరీరంలో అయోడిన్ తప్పనిసరిగా ఉండాలని, అయోడిన్ లోపంతో ఎన్నో రకాల వ్యాధలు వస్తాయని ఆహార భద్రతాధికారి ఎస్.ఖాసింవలి తెలిపారు. జిల్లా ఫుడ్ సేఫ్టీ అధికారి వెంకటరాముడు ఆధ్వర్యంలో గురువారం నూనెపల్లెలో పట్టణంలోని ఉప్పు వ్యాపారులు, కిరాణం రిటైల్ యజమానులకు అయోడిన్ ఉప్పుపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ప్రతి సంవత్సరం అక్టోబర్ 21 నుంచి 27వ తేదీ వరకు అయోడిన్ ఉప్పుపై అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. అయోడిన్ ఒక రసాయన మూలమని, అయోడైజ్ ఉప్పుతో శరీరానికి ఎంతో మేలు జరుగుతుందన్నారు. అయోడిన్ శరీరంలో తగ్గితే బుద్ధిమాంద్యం , చిన్నారుల్లో మానసిక ఎదుగదల లోపం వంటివి వస్తాయన్నారు. థైరాయిడ్ల సంశ్లేషణకు అవసరమైన ముఖ్య మూలంగా అయోడిన్ పని చేస్తుందన్నారు.

ప్రతి గ్రామంలో 'మేరీ మిట్టీ..మేరా దేశ్'



కలశాలు, జాతీయ జెండాలతో విద్యార్థుల ప్రదర్శన

వెలుగోడు: అమర జవాన్లను, దేశం కోసం ప్రాణ త్యాగం చేసిన పౌరులను గౌరవించుకోవడానికి స్వాతంత్ర్య దినోత్సవం(ఆగస్టు 15) వరకూ దేశవ్యాప్తంగా మేరీ మిట్టీ.. మేరా దేశ్ (నా మట్టి.. నా దేశం) పేరిట ప్రత్యేక కార్యక్రమం ప్రతి గ్రామంలోనూ నిర్వహిస్తున్నట్లు కేంద్ర ప్రభుత్వ వలంటీర్ రవికిశోర్‌రెడ్డి తెలిపారు. గురువారం స్థానిక జూనియర్ కళాశాలలో నెహ్రూ యువ కేంద్రం ఆధ్వర్యంలో మేరీ మాటీ.. మేరా దేశ్ నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ.. కార్యక్రమంలో భాగంగా అమృత్ కలశ్ యాత్ర చేపట్టనున్నట్లు తెలిపారు. దేశమంతటా వివిధ ప్రాంతాల నుంచి 7,500 కలశాల్లో పవిత్ర మట్టిని, దాంతోపాటు మొక్కలను దేశ రాజధాని ఢిల్లీకి తీసుకెళ్లనున్నట్లు వెల్లడించారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ వెంకటరమణ, కళాశాల సిబ్బంది, ప్రేరణ యూత్ సభ్యులు నవీన్ కుమార్, పురుషోత్తం గౌడ్ పాల్గొన్నారు.